క్లుప్తంగా

ఉద్యోగులకు పదవి విరమణ సహజం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): ఉద్యోగులకు పదవి విరమణ సహజమని ఉపాధ్యాయులు అన్నారు. మాసాయిపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం ముంతాజ్‌అలీ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరని, విధి నిర్వహణలో చేసిన సేవలే కలకాలం చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఆయన కృషి నేటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరి, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, రంగారెడ్డి, కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎంపీటీసీ బాల్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మడలేశ్వర స్వామి శీతల దేవి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎంపీటీసీ బాల్‌రెడ్డి విరాళం అందజేశారు. ఈ మేరకు చల్మెడ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకునే మడలేశ్వర స్వామి శీతల దేవి నూతన విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవానికి ఎంపీటీసీ నంద్యాల బాల్‌రెడ్డి 31116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సంగోళ్ల చంద్రం, సంగోళ్ల బైరయ్య, సంగోల ముత్తయ్య నర్సింలు, వెంకయ్య, పెద్ద యాదగిరి, సురేశ్, స్వామి, రాజు, చిన్న యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



లక్ష్మణ్‌తండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

టేక్మాల్(మెదక్): దేశ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపిస్తాయని బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం టేక్మాల్ మండలంలోని ఎలకుర్తి, శేరిపల్లి, అచ్చన్నపల్లి, చంద్రుతండా, లక్ష్మణ్ తండాల్లో లాభార్థి సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశాభివృద్ధి బీజేపీతో సాధ్యమని ప్రతీ ఒక్కరు కమలం గుర్తుకు ఓటు వేసి, బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు వడ్డె రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, పట్టణ అధ్యక్షులు దొడ్డ నాగరాజు, నరేందర్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవం.. వైభవోపేతం



రథోత్సవంలో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని రామాలయ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి రథాన్ని పూలమాలలతో అలంకరించి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా శ్రీరామనామస్మరణతో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు మంగళహారతులు ఇచ్చారు.

మూతపడిన వసతి గృహం

- ఏడాదిగా బంద్
- ఇబ్బందుల్లో విద్యార్థులు



మూసివేసిన బీసీ బాలుర వసతి గృహం

రేగోడ్(మెదక్): వసతి గృహాలను మూసేస్తున్నారు. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వసతి గృహాల్లో ఎందరో విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగారు. ఇలాంటి వసతి గృహాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇందులో ఉండటానికి ఆసక్తిని చూపడం లేదు. ఈ కారణంగా ఏడాదిగా వసతి గృహం మూతబడింది. ఇక్కడి నుంచి మరో చోటకి తరలించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నలభై ఏళ్ల క్రితం ఏర్పాటు

జిల్లాలోనే మారుమూల మండలమైన రేగోడ్ గ్రామంలో గత నలభై ఏళ్ల క్రితం 3 – 10వ తరగతి వరకు బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటు చేశారు. అప్పట్లో అద్దె గదుల్లో వసతి గృహాన్ని నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థులు వసతిని పొందారు. తర్వాత నూతన భవనం నిర్మించి వసతిని కొనసాగించారు.

శిథిలావస్థలో భవనం

గత పదేళ్లుగా వసతి గృహం శిథిలావస్థలోకి చేరింది. భవనం, వసతులు సరిగా లేకపోవడం, వర్షాకాలంలో కురుస్తూ ఉండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. వంట గది లేకపోవడంతో వంట చేయడం కూడా కష్టంగా మారింది. మొదట్లో వందమంది ఉన్న విద్యార్థులు కేవలం 41 మంది మాత్రమే ఉన్నారు. భవనంతో పాటు మరుగుదొడ్లు, బాత్రూంలు కూడా అధ్వానంగా చేరాయి. భవనం పాత పడటం, పరిసరాలు అపరిశుభ్రంగా మారేవి. నూతన భవనం నిర్మించాలని పలుమార్లు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

ఏడాదిగా బంద్

రేగోడ్‌లోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం



చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

శిథిలావస్థకు చేరడం, అందులో వసతులు లేకపోవడంతో గత జూన్ నెల నుంచి వసతి గృహం తాళం పడింది. పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని పట్టించుకోక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన భవనం ఏర్పాటు చేసి ఉంటే సుమారు వంద మంది విద్యార్థులు వసతి పొంది విద్యనభ్యసించేవారు.

రూ.1 కోటి అవసరం

రేగోడ్‌లో బీసీ బాలుర నూతన భవనం నిర్మాణానికి రూ.1 కోటి అవసరం ఉన్నట్లుగా అధికారులు చెప్తున్నారు. రూ.1 కోటి మంజూరు చేసి నూతన భవనం నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లుగా సమాచారం. ఈ విషయం వైద్య ఆరోగ్య, టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టిలో ఉందని, త్వరలో నిధులు మంజూరై భవనం నిర్మాణం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న బాత్రూంలు

త్వరలో నిధులు మంజూరు



రేగోడ్‌లో బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి సుమారు రూ.70 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కొంత ఆలస్యం జరిగింది. మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో నిధులు మంజూరు చేయించి, త్వరలోనే భవన నిర్మాణం పనులను ప్రారంభిస్తాం.

– మున్నూరు కిషన్, పీసీసీ సభ్యుడు

చిరుధాన్యాల సాగుతో రైతులకు మేలు

వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు చిరుధాన్యాలు సాగు చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయ శాఖ ఐసీఏఆర్ – ఐఐఎంఆర్ హైదరాబాద్ శాస్త్రవేత్తలు డా. సంగప్ప, డా. రఫీ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుసంగి గ్రామంలో మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం సీఈఓ వెంకటేశం ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎఫ్‌పీఓ సంఘాల ద్వారా మండలంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని పొందవచ్చునన్నారు. గ్రామాల్లోని రైతులు చిరుధాన్యాల సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతీ ఏడాది పంట మార్పిడి చేస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో



చిరుధాన్యాలను అందిస్తున్న శాస్త్రవేత్తలు

జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసుఫ్, మెదక్ జిల్లా నాబార్డ్ అధికారి తిమోతి, ఏఈఓ ఇంద్రయ్య, టేక్మాల్ మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ మొగలయ్య, నాయకులు మొగల్‌రెడ్డి, కె.సంగమేశ్వర్‌గౌడ్, అంజయ్య, వీరారెడ్డి, మహిపాల్‌రెడ్డి, సత్య గౌడ్, రామకృష్ణారెడ్డి, సుభాష్, అనిల్ గౌడ్, రాములు, సాయిలు, కృష్ణ, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు, పల్లకీసేవ



రామాలయం వద్ద బండ్ల ఊరేగింపు



కొడిపల్లిలో సీతారామ పల్లకీ సేవ

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లిలోని అభయ సీతారామాలయం 31వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం బండ్ల ఊరేగింపు, పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకారంతో శ్రీరామ భజన మండలి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతుండగా కొడిపల్లి, దేవులపల్లి గ్రామాలకు చెందిన బండ్లు, ట్రాక్టర్లకు ఊరేగించారు. ఆలయ అర్చకుడు ఫణీంద్రశర్మ పూజలు నిర్వహించారు. అనంతరం దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భజన మండల సభ్యులు డాక్టర్ పురుషోత్తం, ఉడుత రాజు, శ్రీనివాస్‌గుప్తా, జగన్, నవీన్, పద్మ, దుర్గయ్య, వడ్ల దశరథ, లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామస్వామి ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన కోదండ రామస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో



శివ్వంపేటలో సూర్య వాహన పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామివారిని సూర్య వాహన పల్లకిసేవ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, చందు పంతులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు ఉన్నారు.

దాతల సహాయం వెలకట్టలేనిది



ఆశ్రమ పిల్లలకు మందులు అందిస్తున్న నిర్వాహకుడు

శివ్వంపేట(నర్సాపూర్): అనాథల కోసం దాతలు అందిస్తున్న సహాయం వెలకట్టలేనిదని బేతని అనాథాశ్రమం నిర్వాహకుడు సజీవ్‌వర్గీస్ అన్నారు. మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామంలోని బేతని అనాథ ఆశ్రమానికి హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్, ఎపిక్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వీరితో పాటు పలు ప్రాంతాలకు చెందిన ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం సరుకులు, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు విజయ్, జయ, కార్మల్, కోసి, వీరబాబు, విల్సన్, తదితరులు ఉన్నారు.

సురేష్ షెట్కార్ విజయానికి కృషి చేయాలి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ విజయానికి కృషి చేయాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 24న ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్ నామినేషన్ వేస్తారని, 26న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శంకరయ్య, సాగర్ షెట్కార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు జైహింద్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, సత్యనారాయణ, సుభాష్‌గౌడ్, కుంట్ల రాములు, రాంచందర్, దేవేందర్, భానుగౌడ్, జహంగీర్, సాయిరెడ్డి, జైపాల్‌గౌడ్, మహిపాల్‌గౌడ్, రోమాలసాయిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి



తిమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు సూచనలు చేస్తున్న ఏఈఓ



వరికోత వద్ద సూచనలు చేస్తున్న ఏఓ, ఏఈఓ

ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): వాతావరణంలో మార్పులు వచ్చినందున రైతులు వరిధాన్యం ఎండపెట్టే సమయంలో, వరికోత కోసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వర్షసూచన ఉన్నందున ధాన్యం ఎండపెట్టేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం వరికోతలను పరిశీలించారు. హార్వెస్టర్ ద్వారా వరి కోత కోసేటప్పుడు హార్వెస్టర్ ఏ2గేర్ నడపాలని, ఫ్యాన్ స్పీడ్ ఆర్‌ఎంపీ 18లో ఉండేలా చూడాలని సూచించారు. దీంతో వరిధాన్యం తాలు, పొల్లు లేకుండా నాణ్యతగా ఉంటుందని చెప్పారు. రెండు రోజులపాటు వర్షసూచనలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

- మండల వ్యవసాయ శాఖ అధికారి సతీశ్
- నామ మాత్రంగా జరిగిన నిజాంపేట మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సిద్ధరాములు

నిజాంపేట(మెదక్): రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఇన్‌చార్జి మండల వ్యవసాయ శాఖ అధికారి సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దెశెట్టి సిద్ధరాములు, ఎంపీడీఓ రాజిరెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సభను గంట ఆలస్యంగా ప్రారంభించారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖకు ఇన్‌చార్జి మండల వ్యవసాయ శాఖ అధికారి సతీశ్ మాట్లాడుతూ.. యాసంగి పంటలకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ, ఆరోగ్య శాఖ సంబంధించి పలు అంశాలు సమావేశంలో చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో సర్వసభ్య సమావేశాన్ని త్వరగా ముగించామన్నారు.

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసిన ప్రతిపక్ష ఎంపీటీసీలు

సర్వసభ సమావేశానికి పూర్తి స్థాయిలో ఎంపీటీసీలు, కోఆప్షన్ రాకముందుకే పూర్తి చేయడంపై ఎంపీడీఓ రాజిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీపీ సిద్ధరాములు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరుకోగానే సమావేశాన్ని కోరం రాకుండానే ముగించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. గతంలో కోరం పూర్తి రాకపోతే గంటల పాటు వాయిదా వేసుకోసున్నట్లు తెలిపారు. సర్వసభ్య సమావేశాన్ని త్వరగా ముగించడం దానిపై నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. సర్వసభ్య సమావేశం మరో రోజు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ రాజిరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా.. సర్వసభ్య సమావేశం ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో సమయపాలన పాటించడం జరిగిందని, ఎవరిని అగౌరవ పరచాలనే ఉద్దేశ్యం ఎవరికి లేదన్నారు. సమయానికి అనుకూలంగా సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, ధర్మారం వైద్యాధికారి హరిప్రియ, ఐసీడీసీ లక్ష్మి, విద్యుత్ ఏఈ గణేశ్, పీఏసీఎస్ చైర్మన్లు బాపురెడ్డి, అందే కొండల్‌రెడ్డి, ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, లహరి రెడ్డి, లలిత, లద్ద సురేశ్, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతన శెట్టి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో మొదటి రోజు గురు ప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవచనం, రెండో రోజు ఆదివారం ఆవాహిత దేవత పూజలు, మూడో రోజు సోమవారం హోమాలు, యంత్ర ప్రతిష్ఠతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠనున్నారు. అనంతరం అమ్మవారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. మంగళవారం గ్రామ దేవతలకు బోనాలు, అమ్మవారికి బోనాల ఊరేగింపు ఉంటుందని గ్రామ ముదిరాజ్ సంఘం, అక్కడికి గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమం పీఠాధిపతి శ్రీ మాధవానంద స్వామి హాజరై పూజల్లో పాల్గొన్నట్లు చెప్పారు.

లక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి హుండీని శుక్రవారం లెక్కించారు. భక్తులు, గ్రామస్తుల సమక్షంలో 4 నెలల హుండీ లెక్కించగా, రూ.3 లక్షల 25 వేల 165 రూపాయలు వచ్చినట్లు ఈఓ శశిధర్ తెలిపారు. 4 నెలల పాటు ప్రతీ ఆదివారం స్వామివారి జాతర మహోత్సవం నిర్వహించామని, అందుకు సంబంధించి ఆలయ హుండీని లెక్కించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

‘విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం’

మెదక్ కలెక్టరేట్: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై ఏబీవీపీ గుండాల దాడిని ఎస్‌ఎఫ్‌ఐ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మెదక్‌లో ఎస్‌ఎఫ్‌ఐ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై దాడికి పాల్పడడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మెదక్ టౌన్ కార్యదర్శి రాకేష్, సాంసంగ్ కార్తిక్, విష్ణు, శివ పాల్గొన్నారు.

నేడు సీపీఎం విస్తృత స్థాయి సమావేశం

మెదక్ కలెక్టరేట్: సీపీఎం విస్తృతస్థాయి సమావేశం శనివారం మెదక్‌లోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్క రాములు హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ **నిందితులపై చర్యలు తీసుకోవాలి**

రామాయంపేట(మెదక్): మండలంలోని ఆర్.వెంకటాపూర్ గ్రామంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో పాక్షికంగా దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి చెందిన దళితులతో మాట్లాడుతూ.. విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. తన సొంత డబ్బులతో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠ చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, పట్టణ కార్యదర్శి అల్లాడి వెంకటేశ్, స్వామి పాల్గొన్నారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కరీంనగర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కురుల గ్రామంకు చెందిన సురేష్‌దావలే(24) మండలంలోని కరీంనగర్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 14న అతను చేగుంటకు వచ్చి తిరిగి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

◆ **బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామ శివారు ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామానికి చెందిన అమ్మాయి వివాహం, సదాశివనగరంకు చెందిన అబ్బాయితో నిశ్చయమైంది. అమ్మాయి వయస్సు తక్కువగా ఉందన్న విశ్వసనీయ సమాచారంతో తహసీల్దార్ గఫూర్ మియా, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్‌తో కలిసి అక్కడికి వెళ్లి బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మికి చేరవేసి, ఐసీడీఎస్ అధికారులతో అమ్మాయి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

◆ **ఘనంగా పెద్దమ్మ ఉత్సవాలు**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మిర్జాపల్లిలో నిర్వహిస్తున్న పెద్దమ్మ ఆలయ ఉత్సవాలకు హాజరైన ఆమె అమ్మవారిని దర్శించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తులకు ఆహ్వానం**

శివ్వంపేట(నర్సాపూర్): 2024 – 2025 సంవత్సరం పాలిసెట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సాంకేతిక విద్య శిక్షణ బోర్డు ప్రకటన విడుదల చేసిందని గోమారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **మే 3 నుంచి ఇంటి వద్దే ఓటు**

నర్సాపూర్: దివ్యాంగులు, వృద్ధులు మే 3 నుంచి ఇంటి వద్దనే ఓటు వేసే సదుపాయం కల్పిస్తామని ఆర్డీఓ, నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ బూత్ వరకు రాలేకపోతే ఇంటి వద్దనే ఓటు వేసేందుకు సమ్మతి ఇస్తామన్నారు. ఈనెల 24లోపు సంబధిత బీఎల్‌ఓలకు అందజేయాలని చెప్పారు.

◆ **డబుల్ రిజిస్ట్రేషన్ కేసులో మరో ఇద్దరి రిమాండ్**

మనోహరాబాద్(తూప్రాన్): తప్పుడు దస్తావేజులు తయారు చేసి దొంగ రిజిస్ట్రేషన్ చేసిన వారిలో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ ఫిబ్రవరి నెలలో మండలంలోని కూచారం గ్రామ శివారులో ప్లాట్ కొనుగోలు చేశారు. కాగా అట్టి ప్లాట్ వద్దకు రాగా ఇట్టి ప్లాట్ దుర్గా అనే వ్యక్తిదని తెలిసి, మోసపోయినట్లు గ్రహించి మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుల్లో ఒకర్ని మెదక్ కోర్టులో హాజరు పర్చి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.